దరఖాస్తుల ఆహ్వానం

శ్రీరాంపూర్, మే 20 : శ్రీరాంపూర్ ప్రభుత్వ ఐటీఐలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు జూన్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన, 14 ఏండ్లు నిండిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎన్‌సీవీటీ ట్రేడ్‌లు కంప్యూటర్ ఆపరేషన్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(సీఓపీఏ)లో 2 యూనిట్స్ ఏడాది కోర్సులో 48 సీట్లు, ఎలక్ట్రీషన్ 1 యూనిట్ రెండేండ్ల కోర్సులో 20 సీట్లు, మెకానిక్ డిజిల్ 1 యూనిట్ ఏడాది కోర్సులో 24 సీట్లు, ఫిట్టర్ 1 యూనిట్ రెండేండ్ల కోర్సులో 20 సీట్లు, డ్రాఫ్ట్‌మన్ సివిల్ 1 యూనిట్ రెండేండ్ల కోర్సులో 24 సీట్లు ఉన్నాయని వివరించారు.

బెస్ట్ అవైలెబుల్ పాఠశాలల్లో..

నస్పూర్, మే 20 : 2024-25 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలెబుల్ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులకు 3, 5, 8వ తరగతుల్లో ప్రవేశాలకు 21 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 41 సీట్లు కేటాయించగా, 3వ తరగతిలో 21.., 5వ తరగతిలో 10.., 8వ తరగతిలో 10 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని, జూన్ 12న లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాసిపేట, మే 20 : కాసిపేట మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత సోమవారం తెలిపారు. కొండాపూర్, మందమర్రి 33 కేవీ ఫీడర్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మందమర్రిలో..

మందమర్రి, మే 20 : మందమర్రి మండల పరిధిలోని అందుగులపేట 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎన్‌పీడీసీఎల్ ఏఈ మల్లేశం తెలిపారు. జీఎం ఆఫీస్ ఏరియా, కేకే 2, ఊరు మందమర్రి, ఎర్రగుంటపల్లి, మార్కెట్, దీపక్‌నగర్, శ్రీపతినగర్, దొరల బంగ్లా మూడో జోన్ కాలనీ, పాలచెట్టు ఏరియా, పులిమడుగు, అందుగులపేట, నార్లాపూర్, బొక్కలగుట్ట గ్రామాల పరిధిలోని ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి, మే 20: మండలంలో 33 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు కెరమెరి ఏఈ ఎం శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

ఆసిఫాబాద్ టౌన్, మే 20 : కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో చోటు చేసుకున్నది. ఎస్ఐ రాజేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. సందీప్‌నగర్‌కు చెందిన తాపీ మేస్త్రి శ్రీనివాస్ తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. రోజూ మాదిరిగా ఆదివారం రాత్రి భోజనం తర్వత గొడవ పడి, ఇంటి నుంచి గెంటేశాడు. భార్య తలుపు తట్టినా తియ్యకపోవడంతో చుట్టూ పక్కల వారిని పిలిపించి, పగలగొట్టి చూసేసరికి శ్రీనివాస్ ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతిచెంది ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేశ్వర్ తెలిపారు.

ఉరేసుకొని ఒకరు..

మంచిర్యాల ఏసీసీ, మే 20 : మంచిర్యాలలోని మజీద్‌వాడకు చెందిన మహ్మద్ ఖాజీం (52) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. కొద్ది నెలల క్రితం ఓ వ్యక్తికి మధ్యవర్తిగా ఉండి, కొంత నగదు ఇప్పించాడు. సదరు వ్యక్తి డబ్బు కట్టకపోయేసరికి ఇచ్చినవారు మధ్యవర్తిగా ఉన్న ఖాజీంను ఒత్తిడి చేశారు. తట్టుకోలేక ఆదివారం అర్ధరాత్రి ఉరేసుకునానడు. ఖాజీం కొడుకు మిథిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలను సిద్ధం చేయాలి

- మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్

హాజీపూర్ : టీచర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

హాజీపూర్, మే 20 : విద్యా సంవత్సరం ప్రారంభంలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, మరమ్మతులను పూర్తిచేసి, సిద్ధం చేయాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. మండలంలోని వేంపల్లి అమ్మ ఆదర్శ పాఠశాల, గుడిపేటలోని ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాన్ని సోమవారం మండల అభివృద్ధి అధికారి మధుసూదన్‌తో కలిసి పరిశీలించారు. ప్రతీ పాఠశాలలో తాగునీరు, మూత్రశాలలు, విద్యుదీకరణ పనులతో పాటు, గదుల మరమ్మతులు, బాలికల కోసం ప్రత్యేకంగా మూత్రశాలల పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు ప్రారంభం రోజునే విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించేందుకు పనులను వేగవంతం చేసే దిశగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

తాండూర్‌లో ఎంఈవో..

తాండూర్, మే 20 : బెజ్జాల, నరసాపూర్ ఎంపీకే-5 పాఠశాలల్లో చేపడుతున్న పనులను ఎంఈవో వాసాల ప్రభాకర్ పరిశీలించారు. బెజ్జాల ప్రాథమిక పాఠశాలలో 90 శాతం పనులు పూర్తి చేసినందుకు ప్రధానోపాధ్యాయుడు గడ్డం సంపత్, చైర్మన్ మడావి బద్రుబాయిని అభినందించారు. నర్సాపూర్, ఎంపీకే-5 పాఠశాలల్లో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులు, చైర్మన్లకు సూచించారు.

వేమనపల్లిలో ఎంపీడీవో, ఎంపీవో..

వేమనపల్లి, మే 20 : వేమనపల్లి మండలం ముల్కలపేట, రాచర్ల గ్రామాల్లో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు పనులను, అలాగే నీల్వాయి, కల్మలపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాలను పరిశీలించారు. జూన్ 2 నాటికి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సకాలంలో ఏకరూప దుస్తులు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఏపీఎం ఉమారాణి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

జన్నారంలో ఎంఈవో..

జన్నారం, మే 20 : మండలంలోని 48 పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఎంఈవో నడిమెట్ల విజయ్‌కుమార్ పరిశీలించారు. వీవోలు, హెచ్ఎం ప్రతిరోజూ పనులను పర్యవేక్షించి, పూర్తిచేయాలన్నారు. 31వ తేదీ వరకు పిల్లల యూనిఫామ్స్ తయారు చేసేలా, అన్ని పాఠశాలకు అందేలా చూడాలన్నారు.

ట్రాలీ బోల్తాపడి గాయపడ్డ కూలీ మృతి

దండేపల్లి, మే 20 : దండేపల్లి సమీపంలో శుక్రవారం ఉపాధి కూలీల ట్రాలీ బోల్తా పడ్డ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మండల కేంద్రానికి చెందిన బంగారు మల్లవ్వ(45) సోమవారం మృతిచెందింది. తలకు బలమైన గాయాలవగా, కరీంనగర్‌లోని ప్రతిమ దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయింది.

రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. అలాగే గాయపడ్డ కూలీలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. వారు కోలుకునే వరకు పనిదినాలు కట్టిస్తూ గౌరవ వేతనం చెల్లించాలని హైదరాబాద్‌లోని డీఆర్డీఏ ఐఏఎస్ అధికారి అనిత రామచంద్రంతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

భీమారం, మే 20 : భీమాం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ చెఱుకు దీపికారెడ్డి అధ్యక్షతన సోమవాం సాదాసీదాగా సాగింది. అన్ని శాఖల అధికారులు హాజరు కాలేదు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉండగా, తీర్మాణాలను ప్రవేశపెట్టలేదు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాధరాథోడ్, జడ్పీటీసీ భూక్యా తిరుమల, ఎంపీటీసీ పెద్దల రూప, తహసీల్దార్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీపీ దీపికారెడ్డి

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, మే 20 : పదోతరగతి, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ, పాలిసెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్లు దాసరి వేణు, దీపక్ తివారి, కాగజ్‌నగర్ రాజస్వ మండల అధికారి సురేశ్‌తో కలిసి పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 1200 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల, బాలుర పాఠశాల, సిర్పూర్(టీ) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రా లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్ పరీక్షలను ఈ నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఫస్టియర్‌లో 1938, సెకండియర్‌లో 1,051 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్‌లో 2, కాగజ్‌నగర్‌లో 2, జైనూర్, తిర్యాణి, రెబ్బెన, కౌటాల, వాంకిడి, కెరమెరి, సిర్పూర్ (యూ)లో ఒక్కో పరీక్షాకేంద్రం చొప్పున ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నెల 24న జరగనున్న పాలిసెట్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో 4 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని తెలిపారు.

పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

నస్పూర్, మే 20 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. కేంద్ర సర్వీసులకు చెందిన వివిధ శాఖల సహాయ విభాగాల అధికారులకు సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో విలేజ్ అలాచ్‌మెంట్ మాడ్యూల్ అంశంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఆర్‌డీవో కిషన్, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, డీఎంహెచ్‌వో అనిత, జిల్లా వ్యవసాయాధికారి కల్పనతో కలిసి ప్రారంభించారు. 24వ తేదీ వరకు కేంద్ర సర్వీసులకు చెందిన సహాయ విభాగాల అధికారులు శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించి, వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారన్నారు. సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు వద్ద ఆందోళన

రాజమండ్రి నుంచి వచ్చిన జాలర్లు

చెన్నూర్, మే 20 : పట్టణంలోని పెద్ద చెరువు వద్ద ముదిరాజ్ కులస్తులు సోమవారం ఆందోళన చేశారు. చేపల పెంపకానికి తమకూ వాటా కావాలని డిమాండ్ చేశారు. తెలిసిన వివరాల ప్రకారం.. కొందరు సొసైటీని ఏర్పాటు చేసుకొని పెద్ద చెరువులో చేపల పెంపకం చేపట్టారు. ఈ చెరువును సొసైటీ ద్వారా లీజుకు తీసుకున్న వ్యక్తి చేపలను పట్టేందుకు రాజమండ్రి నుంచి జాలర్లను తీసుకొచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న ముదిరాజ్‌లు పెద్ద చెరువు వద్దకు వచ్చి ఆందోళన చేస్తూ చేపలు పట్టడాన్ని అడ్డుకున్నారు. సమస్య పరిష్కారమయ్యే దాకా చేపలు పట్టవద్దని డిమాండ్ చేశారు. దీంతో జాలర్లను చేపలు పట్టడాన్ని విరమించుకున్నారు.

ఉపాధి పనుల పరిశీలన

జన్నారం, మే 20 : ఉపాధి కూలీలకు ప్రమాదాలు జరుగకుండా చూడాలని డీఆర్డీవో కిషన్ పేర్కొన్నారు. మండలంలోని చింతగూడ సమీపంలోని అడవుల్లో సోమవారం ఉపాధి పని ప్రదేశానికి వెళ్లి, కూలీలతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రూ.300 కూలి వచ్చేలా పనిచేయాలని సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు నీడ, నీటి వసతిని కల్పించాలని అధికారులకు సూచించారు. ఏపీవో రవీందర్ ఉన్నారు.

రిటైర్డ్ కార్మికులకు రూ.10 లక్షలు చెల్లించాలి

బెల్లంపల్లి, మే 20 : సింగరేణి వ్యాప్తంగా గ్రాడ్యూటీ చెల్లింపులో అన్యాయానికి గురైన రిటైర్డ్ కార్మికులకు ఒక్కొక్కరికీ రూ.10 లక్షల ఏరియర్స్ చెల్లించాలని టీఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి టీ మణిరామ్ సింగ్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. 2016 -18 మధ్య రిటైర్డ్ అయిన కార్మికులకు పెరిగిన గ్రాడ్యూటీ చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. 3,816 మంది అన్యాయానికి గురయ్యారని తెలిపారు. ఆ యూనియన్ ఉపాధ్యక్షుడు గద్దెల నారాయణ, బెల్లంపల్లి ఏరియా నాయకులు డీ చంద్రమౌళి, వీ వెంకటస్వామి, పాషా, జిల్లా నాయకులు వో జీవరత్నం, జీ గంగయ్య, పొంతం యాదగిరి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎండీ హసన్, ఎస్ సదానందం, బొల్లు మల్లయ్య, సీహెచ్ రమేశ్, ఎం నరసింహ, కొత్తూరు నారాయణ, ఎస్‌కే ఇమామ్ పాల్గొన్నారు.

బాలాజీ అనుకోడలో వైద్యశిబిరం

పరీక్షలు చేస్తున్న వైద్యుడు రాజ్‌కుమార్

చింతలమానేపల్లి , మే 20 : మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రవీంద్రనగర్, బాబాపూర్, గంగాపూర్ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో 54 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. రక్త నమూనాలు సేకరించి మందులు అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రతినెలా మందులు తమ పీహెచ్‌సీల నుంచి అందిస్తామని అన్నారు. ఆదేవిధంగా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, హెల్త్ సూపర్‌వైజర్ ఇందిరాగాంధీ, వైద్య సిబ్బంది,గ్రామస్తులు ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

కాగజ్‌నగర్, మే 20 : వయోవృద్ధులకు, దివ్యాంగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ సోమవారం డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సంచార వైద్య వాహనాల ద్వారా వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికి సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ప్రతినిధులు నారాయణ, రమణయ్య, ఎల్లా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను అడ్డుకోవడం సరికాదు

కాగజ్‌నగర్, మే 20 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్‌లో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబును పోలీసులు అడ్డుకోవడం సరికాదని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, ప్రతినిధులు ఎల్లా గౌడ్, నాగేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జైనూర్‌లోని బాధితులను పరామర్శించడానికి వెళ్లిన ఆయనను ఎలా అడ్డుకుంటారని ప్రశ్నించారు.

చింతపెల్లి రజక సంఘం కమిటీ

దండేపల్లి, మే 20 : దండేపల్లి మండలం చింతపెల్లి గ్రామ రజక యువజన సంఘం కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కట్కూరి రాజన్న, మండలాధ్యక్షుడు పుట్టపాక తిరుపతి తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా కుదురుపాక ఇందూర్, అధ్యక్షుడిగా తాడూరి రమేశ్, ఉపాధ్యక్షుడిగా పుట్టపాక సాయి, గంప సాయి, ప్రధాన కార్యదర్శిగా నగేశ్, కోశాధికారిగా రాజు, ప్రచార కార్యదర్శిగా రోహిత్, సంయుక్త కార్యదర్శిగా వెంకటేశ్, నరేశ్, కార్యవర్గ సభ్యులుగా మధూకర్, సురేశ్, వెంకటేశ్, సతీశ్, మహేశ్ తదితరులు ఎనినకయ్యారు.

గోదావరిలో పడి యువకుడి మృతి

దండేపల్లి, మే 20 : కరీంనగర్ జిల్లా కొత్తపెల్లి మండలం బద్దిపల్లికి చెందిన దుర్గం కీర్తన్‌గౌడ్(19) సోమవారం గూడెం వద్ద గోదావరిలో పడి మృతిచెందాడు. దండేపల్లి ఎస్ఐ భూమేశ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్ మాలధారణ కోసం కీర్తన్‌గౌడ్ తన స్నేహితులు కోడూరి శేఖర్, గర్రెపల్లి వినయ్, వెగ్గలం అజయ్, దూలం మురళి, కొమ్ము సాయితో సోమవారం ఉదయం 6 గంటలకు గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయానికి వెళ్లాడు. మాలధారణకు ముందు 10 గంటల ప్రాంతంలో స్నేహితులతో కలిసి గోదావరిలో స్నానం చేస్తుండగా, ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి, మృతిచెందాడు. లక్షెట్టిపేటలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కీర్తన్‌గౌడ్ తండ్రి తిరుపతి ఫిరాయదు మేరకు కేసు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బెల్లంపల్లి, మే 20 : బెల్లంపల్లి-మందమర్రి రైల్వేస్టేషన్ల మధ్య సబ్‌స్టేషన్ సమీప రైల్వేట్రాక్‌పై సోమవారం గుర్తు తెలియని మృతదేహం (సుమారు 50 ఏండ్ల పురుషుడు) లభ్యమైనట్లు బెల్లంపల్లి రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. రైలులో ప్రయాణం చేస్తూ కింద పడి మృతి చెందినట్లు వెల్లడించారు. నల్లని సన్నని గీతలు గల తెల్లని ఫుల్ షర్ట్, నల్లని కాటన్ పాయింట్ ధరించి ఉన్నాడని వివరించారు. మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖాన మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు 87126 58596 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నాసిరకం పనిముట్లు ప్రమాదకరం

శ్రీరాంపూర్, మే 20 : శ్రీరాంపూర్ ఆర్కే న్యూటెక్ గనిని సోమవారం బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా సందర్శించారు. కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యాజమాన్యం సరఫరా చేస్తున్న కార్మికుల పనిముట్లు, యంత్రాల విడిభాగాలను పరశీలించారు. అవి నాణ్యతగా లేవన్నారు. నాసిరకం పనిముట్లు, యంత్రాల విడిభాగాలు ఉపయోగించడం వల్ల కార్మికులకు ప్రమాదకరంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, నాయకులు రమేశ్, చంద్రమౌళి, కే రాజయ్య, తిరుపతిరెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మెడిటేషన్‌తో ఒత్తిడి దూరం

బెల్లంపల్లి, మే 20 : మెడిటేషన్‌తో ఒత్తిడిని సమూలంగా తగ్గించుకోవచ్చని శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్ మెడిటేషన్ ట్రైనర్ దాసారపు సమత అన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని కాళోజీ శాఖ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు సోమవారం మెడిటేషన్‌పై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి ఉప్పు గోపి, స్వీపర్ నీలి రమేశ్, పోటీ పరీక్షల అభ్యర్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

కొత్త గనులను ప్రారంభించాలి

మందమర్రి, మే 20 : మందమర్రి ఏరియాలో ప్రతపాదిత కేకే-6, శ్రావణపల్లి ఓపెన్ కాస్ట్ గనులను ప్రారంభించాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. మందమర్రి పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఏరియాలో ఇప్పటికే కేకే-1, ఆర్కే-1ఏ గనులు మూతపడగా, ఆర్కే ఓసీ మూసివేతకు సిద్ధంగా ఉందన్నారు. 50 నుంచి 60 ఏండ్లు నడుపాల్సిన గనులను మూసి వేయాలనే దురుద్దేశంతో యాజమాన్యం ఓసీలుగా మారుస్తున్నదని ఆరోపించారు. హెచ్ఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణప్రసాద్, అధ్యక్షుడు జక్కుల నారాయణ, ఏరియా ఉపాధ్యక్షుడు జే శ్రీనివాస్, అనిల్ రెడ్డి, దుర్గం లక్ష్మణ్, వెల్ది సుదర్శన్, గౌస్, రామస్వామి, నవీన్ పాల్గొన్నారు.

లెవల్ వంతెన పనుల పరిశీలన

పెంచికల్ పేట్, మే 20 : మండలంలోని ఎర్రగుంట ఉచ్చమల్లి వాగులో లెవెల్ వంతెన పనులను ఐటీడీఏ డీఈ నిరంజన్ రావు సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వంతెన పనులను త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. ఆయనతోపాటు అధికారులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో ప్రతికా విలేకరిపై దాడి

కాగజ్‌నగర్, మే 20 : పట్టణానికి చెందిన పత్రికా విలేకరి అంగాల తిరుపతిపై మైనింగ్ నిర్వాహకులు సోమవారం దాడి చేశారు. వివరాల్లోకి వెళితే చారిగాం రోడ్డులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. జర్నలిస్టు తిరుపతి అక్కడికి వెళ్లి ఫొటోలు తీసే క్రమంలో కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ కోయవాగుకు చెందిన కలీం తన అనుచరులు తిరుపతిపై దాడి చేశారు. ఈ విషయమై తిరుపతి కాగజ్‌నగర్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఈ సెట్‌లో రాష్ట్రస్థాయి ఐదో ర్యాంక్

రెబ్బెన, మే 20 : మండల కేంద్రానికి చెందిన ఎంఏ హషీర్‌ఉస్మానీ సోమవారం విడుదలైన ఈసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంక్ సాధించాడు. బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్ విభాగంలో విద్యనభ్యసిస్తున్న ఉస్మానీ రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించడంప